


వ్యవసాయశాఖ శకటం


మోమెంటో అందుకుంటున్న కమిషనర్ అరుణ


కలెక్టర్ షణ్మోహన్


కవాతు నిర్వహించిన పోలీస్ సిబ్బందిని అభినందిస్తున్న కలెక్టర్

మురిసిన త్రివర్ణం


మొదటి బహుమతిని కైవసం చేసుకున్న వ్యవసాయశాఖ శకటం


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

- ఘనంగా 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు
- జాతీయ జెండాను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: 75వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. శుక్రవారం పోలీస్ పెరేడ్‌గ్రౌండ్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్‌కు జిల్లా ఎస్పి రిశాంత్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ 9.10గం.లకు జాతీయ పతాక ఆవిష్కరించారు. పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టర్ జిల్లా ఎస్పితో కలసి పోలీస్‌పెరేడ్‌ను పరిశీలించారు. పెరేడ్ పరిశీలన అనంతరం జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ అభివద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించి సాధించిన ప్రగతిని ప్రసంగం రూపంలో చదివి వినిపించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి శకటాల ప్రదర్శన, తదుపరి విద్యాశాఖ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కతిక కార్యక్రమాల నిర్వహణ, ఉత్తమ సేవలందించిన అధికారులు సిబ్బందికి జిల్లా కలెక్టర్ అవార్డుల ప్రదానం, వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు పరిశీలన అనంతరం జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, జెడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావ్, జేసి శ్రీనివాసులు, డిఎఫ్‌ఓ చైతన్య కుమార్ రెడ్డి, నగర మేయర్ అముద, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి డా.ఐ.కరుణకుమార్, మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస్, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, జెడ్పి వైస్ ఛైర్మన్ రమ్య, అడిషనల్ ఎస్పి సుధాకర్, శ్రీలక్ష్మీ, నాగేశ్వరరావు, జెడ్‌పి సిఈఓ ప్రభాకర్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి ప్రసంగం.. కలెక్టర్ అభినందన

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా దేశభక్తి ఉట్టి పడేలా విద్యాశాఖ ఆధ్వర్యంలో సాంస్కతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. దీనితోపాటు గాబ్రియల్ పాఠశాలలో రెండవ తరగతి చదివే విద్యార్థి అమీనా గణతంత్ర దినోత్సవంనకు సంబంధించి ఇంగ్లీషులో చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిన్నారిని అభినందిస్తూ మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు వీరగాథ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, వకత్వ, పెయింటింగ్, పద్యాల పోటీలలో గెలుపొందిన నలుగురు విద్యార్థులకు రూ.2వేలు నగదు బహుమతితో పాటు మెమెంటోను అందజేశారు. ఈ పోటీలలో మొదటి స్థానంలో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుంది.

రూ.1897 కోట్ల చెక్కు పంపిణీ

ప్రభుత్వ అభివద్ధి సంక్షేమ పథకాల లబ్ధిదారులకు సంబంధించి రూ.1897కోట్ల ఆస్తులను కలెక్టర్ షన్మోహన్ పంపిణీ చేశారు. శుక్రవారం పోలీస్ పెరేడ్‌గ్రౌండ్‌లో డిఆర్డిఏ ద్వారా బ్యాంక్ లింకేజీ కింద 15,060 ఎస్‌హెచ్‌జిలకు రూ.1429కోట్లు, స్త్రీనిధి కింద 28,067 మంది స్వయం సహాయక సంఘ మహిళలకు రూ.186 కోట్లు మొత్తం రూ.1,615 కోట్ల మెగా చెక్కును, మెప్మా ద్వారా బ్యాంక్ లింకేజీ కింద 1,921 ఎస్‌హెచ్‌జిలకు రూ.281కోట్ల మెగా చెక్కును, విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా 10మంది లబ్ధిదారులకు రూ.1.74లక్షలతో ల్యాప్ టాప్, ట్రై సైకిల్‌లు, వీల్ చైర్‌లను మొత్తం రూ.1,897కోట్ల ఆస్తులను మెగా చెక్కుల రూపంలో కలెక్టర్ పంపిణీ చేశారు.

తరువాయి భాగం 6లో

బకాయిలు చెల్లిస్తారా.. బుకాయిస్తారా.!


చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న యూటీఎఫ్ నేతలు

- పెండింగ్ బకాయిలు చెల్లించాలని యూటీఎఫ్ నేతల డిమాండ్
- చిత్తూరులో భారీ ర్యాలీ, నిరసన

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లిస్తారా.. లేదా అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ శుక్రవారం చిత్తూరులో యూటీఎఫ్ నాయకులు భారీ ర్యాలీ చేపట్టారు. యూటీఎఫ్ కార్యాలయం నుంచి డీఈవో కార్యాలయం మీదుగా గాంధీ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు బకాయిపడ్డ పిఎఫ్, ఏపిజిఎల్ఐ, సరెండర్ లీవు, పిఆర్‌సి, డిఏ బకాయిలు దాదాపు రూ.18,006కోట్లు ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పోరాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిత్తూరు కేంద్రంలో నిర్వహించడం జరుగుతోందన్నారు. తామంతా నెలనెలా దాచుకోనే డబ్బులు చెల్లించడానికి తాత్సారం దేనికని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు, తక్షణమే ఆర్థిక చెల్లింపుతో పాటు, విద్యా వ్యవస్థలలో ప్రశాంతమైన వాతావరణ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సోమశేఖర నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్, నాయకులు సుధాకర రెడ్డి, పి.ఆర్.మునిరత్నం, కె.దీనావతి, రెడ్డెప్పనాయుడు, కృష్ణమూర్తి, ఎస్.పి.బాషా, ఏకాంబరం, సరిత, సురేష్, పార్థసారధి, తదితరులు పాల్గొన్నారు.

నగరి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్టీయూ ఉపాధ్యాయవాణి ప్రధాన సంపాదకులు గాజుల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పి.సి.ఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ, నగరి డివిజన్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, పవన్‌కుమార్ రెడ్డి, గంగామోహన్, మహేంద్రన్, గణేశన్ తదితరులు పాల్గొన్నారు.

మండలిలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యలపై ప్రశ్నించాం

- మాజీ పిడిఎఫ్ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: 16 సంవత్సరాలు మూడు పర్యాయాలు పిడిఎఫ్ ఎమ్మెల్సీగా శాసనమండలిలో ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల సమస్యలపై తనదైన శైలిలో ప్రభుత్వాలను ప్రశ్నించానని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం స్థానిక విజయం డిగ్రీ కళాశాలలో మండలిలో మాస్టారు అనే పుస్తక ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జనవిజ్ఞాన వేదిక, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంయుక్తంగా పుస్తక ఆవిష్కరణ సభను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు శాసనమండలిలో విబిఎస్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విటపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తాను 16సంవత్సరాలు పనిచేసిన కాలంలో ఐదుగురు ముఖ్యమంత్రులు మారారన్నారు. యుటిఎఫ్ జనవిజ్ఞాన వేదిక కార్యకర్తగా, నాయకుడిగా తనకున్న అనుభవంతో ప్రభుత్వ పాఠశాలలు, మారుమూల ప్రాథమిక పాఠశాలల అభివృద్ధి కోసం కృషి చేసినట్లు తెలిపారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల కృషి ఫలితంగానే మాడల్ హైస్కూల్స్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాల్సి వచ్చిందన్నారు. అంగన్వాడీలు ఇటీవల కాలంలో వీరోచిత పోరాటాన్ని నిర్వహించారన్నారు. ఎమ్మెల్సీగా ఉన్న శాసనమండలిలో మాస్టారుగానే వ్యవహరిస్తూ తనదైన శైలిలో సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు అరుణ శివప్రసాద్, గిరిధర్, మ్యాథ్స్ ఫోరం నాయకులు సుధాకర్, జెవివి సీనియర్ నాయకులు గల్లా రంగనాథం, ఛాయా మోహన్. యుటిఎఫ్ నాయకులు సోమశేఖర్‌నాయుడు, మణికంఠ, జీవీ రమణలతోపాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విఠపు బాలసుబ్రమణ్యం, జనవిజ్ఞాన వేదిక యుటిఎఫ్ నాయకులు

అంగన్వాడీలది చారిత్రాత్మక విజయం

- విజయోత్సవ సభలో యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు

ప్రజాశక్తి-కార్వేటినగరం: 42 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా విరోచితమైన సమ్మె చేసి అనేక విజయాలు సాధించిన సందర్భంగా శుక్రవారం కార్వేటినగరం ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో విజయోస్తవ సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ 42 రోజులు కాలంలో ప్రభుత్వం, అధికారులు అనేక రకాల అవరోధాలు సృష్టించినప్పటికీ ఏమాత్రం లెక్కచేయకుండా పోరాటం చేసిన అంగన్వాడీల అందరినీ ఆయన అభినందించారు. మరోసారి అంగన్వాడీల ఐక్యత చాటి చెప్పారన్నారు. తాళాలు పగలగొట్టి, నోటీసులు ఇచ్చినా, టెర్మినేషన్ చేసినా ఏమాత్రం లెక్క చేయకుండా కలెక్టరేట్ ముట్టడి, చలో విజయవాడ లాంటి విరోచితమైన పోరాటాలు చేయడంతో పోరాటం సఫలీకృతమైందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు లక్ష్మీనరసమ్మ అధ్యక్షత వహించగా కార్యదర్శి మమత మాట్లాడుతూ ఇదే పద్ధతిలో ప్రాజెక్టులో భవిష్యత్తులో కూడా ఐక్యతగా ఉండాలని ఇలాంటి సమస్యలు వచ్చినా కమిటీ హామీ ఇచ్చారు. నాయకులు రాణి, భాను తదితరులు పాల్గొన్నారు.


విజయోత్సవ సభలో సీఐటీయూ నాయకులు

చిత్తూరులో చిక్కని ఓటరు నాడి



- బరిలో హేమాహేమీలు
- విజయం ఎవరిదైనా మెజారిటీ స్వల్పమే
- వైసీపీ నుంచి విజయానందరెడ్డి ఖరారు
- టీడీపీ నుంచి ఐదు గురు ఆశావహులు
- జనసేన అభ్యర్థి ఎవరనేది పొత్తులో భాగమే


చిత్తూరు నియోజకవర్గం ఓటర్ల వివరాలు
మొత్తం ఓటర్ల సంఖ్య - 2,00,822మంది
పురుషులు - 97,765మంది
మహిళలు - 1,03,023మంది
ట్రాన్స్‌జెండర్లు - 34మంది



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయం చర్చనీయాంశంగా మారింది. ఏపీలో 172వ అసెంబ్లీ స్థానంలో అభ్యర్థుల విషయంలో ప్రధాన పార్టీలు ఆచీతూచీ అడుగేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటి వరకూ చిత్తూరు నుంచి గెలిచిన అన్ని సందర్భాల్లో 1999 తర్వాత, 1989 ముందు ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులకే ఓటర్లు విజయాన్నిచ్చారు. 1952 నుంచి కాంగ్రెస్, జనతాపార్టీ, తెలుగుదేశం పార్టీలకు సంబంధించి అభ్యర్థులను 5ఏళ్ల కోసారి మారుస్తూ చిత్తూరు ఓటర్లు తీర్పునిచ్చారు. ఈ మేరకు 1989లో ఇండిపెండెంట్‌గా, 1994, 1999లో కాంగ్రెస్ పార్టీ నుంచి వరుసగా ముడుసార్లు సీకే బాబు విజయం సాధించారు. కాగా అప్పటి నుంచి కాంగ్రెస్, టీడీపీ అభ్యర్థులు అధికారాన్ని చేపట్టారు. 2019ఎన్నికల్లో వైసీపీ నుంచి ఆరని శ్రీనివాసులు గెలిచారు. ప్రస్తుత రాజీకీయ పరిస్థితుల్లో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారన్న అంశమే చిత్తూరులో చర్చనీయాంశంగా ఉంది. అందుకే ఏ పార్టీ కూడా వరుస విజయాలు సాధించలేకపోవడమే చర్చకు కారణమైంది.

దూకుడు పెంచిన వైసీపీ అభ్యర్థి

అధికార వైసీపీ నుంచి చిత్తూరు సమన్వయకర్తగా విజయానందరెడ్డిని అధిష్టానం ప్రకటించింది. దాదాపుగా ఆయనే ఈ ఎన్నికల్లో బరిలో ఉంటారనే తెలుస్తోంది. ఇప్పటికే ఆయన ఏపీఎస్‌ఆర్‌టీసీ వైస్ ఛైర్మన్‌గా కీలక పదవిలో ఉన్నారు. ఇప్పటిదాకా చిత్తూరులో వరుస సేవా కార్యక్రమాలతో బిజీబిజీగా ఉన్న ఆయన తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించడంతో మరింత దూకుడు పెంచారు. చిత్తూరుఅర్బన్, రూరల్, గుడిపాల మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.



టీడీపీ నుంచి ఐదు మంది ఆశావహులు

ప్రధాన ప్రతిపక్ష పార్టీ టీడీపీ నుంచి ఐదు గురు ఆశావహులు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. వారిలో డికె ఆదికేశవులు తనయుడు డికె శ్రీనివాస్, సీనియర్ నాయకులు గురజాల జగన్మోహన్, మాజీ మేయర్ కఠారి హేమలత, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కాజూరు బాలాజి, తిరుచానూరు సర్పంచ్ సీఆర్ రాజన్ ఆశావాహులుగా ఉన్నారు. టీడీపీ అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా కలిసి పనిస్తామని ఎవరికివారు చెబుతున్నా.. టికెట్ తమకే కావాలంటూ ఎవరికివారు ప్రయత్నాల్లో ఉన్నారు. అయితే ఇటీవల జనసేన, టీడీపీ పొత్తులో భాగంగా ఏ పార్టీ అభ్యర్థిని ఖరారు చేస్తారనే సందిగ్ధం నెలకొంది. అయితే జనసేన టికెట్ కోసం డీకే ఆదికేశవులు నాయుడు మనమరాలు చైతన్య తనకు అవకాశం ఇస్తే తానే జనసేన నుంచి పోటీ చేస్తానంటూ పలు సందర్భాల్లో పేర్కొంది. కాగా ఆమె గత నెల పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు.

మురిసిన త్రివర్ణం


చిత్తూరు: బృందావనం స్కూల్లో గణతంత్ర వేడుకలు


సోమల: తహశీల్దార్ కార్యాలయం వద్ద జెండా వందనం


రామకుప్పం: ఎంపీడీవో కార్యాలయం వద్ద


సదుం: మోమెంటోలు అందజేస్తున్న పూర్వ విద్యార్థి


కార్వేటినగరం: త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ లతబాలాజీ

5వ పేజీ తరువాయి

మొదటి బహుమతి కైవసం చేసుకున్న వ్యవసాయశాఖ శకటం

గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శనలో వ్యవసాయ శాఖ మొదటి బహుమతి కైవసం చేసుకుంది. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలకు అద్దం పట్టేలా శకటాల ప్రదర్శన సాగింది. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరణ

గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు జెండా ఆవిష్కరణ చేశారు. మహాత్మాగాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు.

నగరపాలక కార్యాలయంలో..

భారత 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు నగరపాలక కార్యాలయంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. నగర కమిషనర్ డా.జె.అరుణ జాతీయ జెండాను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యాలయ ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహానికి మేయర్ ఎస్.అముద, కమిషనర్ డా.జె.అరుణ, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నగరపాలక అధికారులు పూలమాలవేసి నివాళులు అర్పించారు.

బృందావనం స్కూల్లో..

స్థానిక సంతపేట నందుగల బృందావన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గణతంత్ర వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకున్నామని పాఠశాల కరస్పాండెంట్ శైలజకుమారి తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమలలో..

75వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనూ ప్రభుత్వ కార్యాలయాల వద్ద గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించి జాతీయ జెండా ఎగురవేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వెంకటనరసింహులు ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగరవేశారు.

రామకుప్పంలో..

గణతంత్ర దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండల కార్యాలయం, ప్రాథమిక ఆసుపత్రులు, ప్రభుత్వ ప్రవేట్ పాఠశాలల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి గణతంత్ర దినోత్సవం జరుపుకున్నారు.

సదుంలో..

75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సదుం జడ్పీ హైస్కూల్లో 1983-84 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ మారెళ్ళ రవి సదుం ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, మేమేంటోలును అందజేశారు.

బైరెడ్డిపల్లిలో..

గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కుమారస్వామి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు వేడుకలు జరుపుకొన్నారు.

కార్వేటినగరంలో..

అమరవీరుల త్యాగఫలమే నేడు జరుపుకుంటున్న గణతంత్ర దినోత్సవమని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. శుక్రవారం రిపబ్లిక్ డేను పురస్కరించుకుని ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంలో మండల విద్యావనరుల కార్యాలయం, పంచాయతీ కార్యాలయాల్లో త్రివర్ణ పథకాలను ఎగుర వేసి ఘనంగ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుకున్నారు.

బంగారుపాళ్యంలో..

గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ఘనంగా జెండా వందనం కార్యక్రమాన్ని చేపట్టారు. తహశీల్దర్ కార్యాలయంలో తహశీల్దార్ అనిల్‌కుమార్, పోలీస్‌స్టేషన్‌లో సీఐ నాగరాజు, ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, ఎంఈఓ నాగేశ్వరరావులు ఆయా కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణ చేశారు.

గంగాధరనెల్లూరులో..

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ ఇన్బనాథన్ జెండా వందనం చేశారు. పోలీస్‌స్టేషన్లో ఎ.ఎస్.ఐ. ఆంజనేయులు రెడ్డి, ఎంపీడీవో సుధాకర్, ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ హరిబాబు, ఐసిడిఎస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సుజాత, ఎట్టేరి శ్రీ భానోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో కరస్పాండెంట్ నాగేశ్వరరావు, హెచ్.ఎం. లావణ్య జాతీయ జెండాను ఎగురువేసి ప్రముఖుల గురించి వివరించారు. అనంతరం పలువురు విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

వెదురుకుప్పంలో..

స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేపట్టారు. డీటీ జయంత్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నగరిలో..

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విష్ణువర్మ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

పెద్దపంజాణిలో

మండల వ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రెడ్డప్ప ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి మండల అభివృద్ధి కార్యాలయంలో, అలాగే బట్టందొడ్డి సచివాలయంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ శంకరప్ప ఆధ్వర్యంలో, రాజుపల్లి సచివాలయ కేంద్రంలో జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి ఆధ్వర్యంలో, గణతంత్ర వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పులా శంకర్‌రెడ్డి, మాలమహానాడు మండల అధ్యక్షుడు మంజునాథ్, జిల్లా ప్రచార కార్యదర్శి తిప్పయ్య పాల్గొన్నారు.


గంగాధరనెల్లూరు: జెండా ఆవిష్కరిస్తున్న తహశీల్దార్


పెద్దపంజాణి: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు


నగరి: కోర్టు ఆవరణలో


బంగారుపాళ్యం: ప్రశంసా పత్రం అందుకుంటున్న ఏఎస్ఐ మల్లప్ప


బైరెడ్డిపల్లి: ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్ఐ మోహన్‌కుమార్


రామకుప్పం: ప్రశంసా పత్రం అందుకుంటున్న కార్యదర్శి


సోమల: ప్రశంసా పత్రం అందుకుంటున్న పంచాయతీ కార్యదర్శి సుధాకర్


బంగారుపాళ్యం: అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయులు షంషీర్‌ఖాన్


వెదురుకుప్పం: ప్రశంసా పత్రం అందుకుంటున్న ట్రాన్స్‌కో ఏఈ రామాంజనేయులు

'రా.. కదలిరా'పై గురజాల విస్తృత పర్యటన


రా కదలిరా కార్యక్రమంలో గురజాల జగన్మోహన్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: 'రా కదలిరా' విస్తృత ప్రచారంలో టిడిపి అభ్యర్థి గురజాల జగన్మోహన్ 17, 18 వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే ప్రజాసంక్షేమ కార్యక్రమాలను వివరించారు. జగన్మోహన్ పర్యటనలు ప్రజలు విస్తృతంగా పాల్గొన్నారు.

బీసీలకు తీవ్ర అన్యాయం: థామస్

ప్రజాశక్తి-వెదురుకుప్పం: రాష్ట్ర వ్యాప్తంగా బీసీలపై దాడులు పెరిగిపోయాయని జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ థామస్ అన్నారు. శుక్రవారం వెదురుకుప్పంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. బీసీ వర్గాలకు వైసీపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సిఆర్ రాజన్, కోదండయాదవ్, షణ్ముగ రెడ్డి, మోహన్ మురళి, చెంగ్రా యాదవ్, శేఖర్ యాదవ్, రుద్రయ్య నాయుడు, రవి యాదవ్ పాల్గొన్నారు.

ప్రారంభానికి సామాజిక ఆరోగ్య కేంద్రం సిద్ధం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో 'నాడు-నేడు' కింద రూ.7.25 కోట్లతో రోగులకు మెరుగైన సౌకర్యాలతో చిన్నగొట్టి గల్లు లో నూతన సామాజిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని నిర్మించారు. ఇందు కోసం ఎమ్మెల్లే చెవిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించి అనుమతులు మంజూరు చేయించారు. మొదట ముప్పై పడకలతో సిద్ధంగా వున్న ఈ సామాజిక ఆరోగ్య కేంద్రం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఇతర ప్రధాన నాయకులు చేతుల మీదుగా ఈ నెల31 న ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కావలసిన ఏర్పాట్లపై ఎంపిపీ బాలం యుగంధర్ , ఎంపీడీఓ దేవేంద్ర బాబు, నాయకులు కొండారెడ్డి, బావాజీ, గోటూరు లోకనాథ రెడ్డి, వైద్యాధికారి శ్రీధర్ , ఆసుపత్రి కమిటీ సభ్యులతో కలిసి ఆరోగ్య కేంద్రంలో సమీక్షించారు.

ఊరికి ఉపకారం తృప్తి నిచ్చింది..

- డాక్టర్ పద్మమోహన్ మల్లం.

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): 'నాకు జన్మనిచ్చిన ఊరికి ఉపకారం చేయడం.. జన్మభూమికి సేవ చేయటం తృప్తిని ఇచ్చింది..' అంటూ డాక్టర్ మల్లం పద్మమోహన్ తెలిపారు. ఎంత సంపాదించాం అన్నది ముఖ్యం కాదు తమ సంపాదనలో ఎంతో కొంత ఊరి ప్రజల ఉపయోగ కోసం కోసం వినియోగించి సేవ చేయటంలో ఉన్నంత ఆనందం మరెక్కడా దొరకదని వారు తెలిపారు. చంద్రగిరి మండలం తొండవాడ గ్రామంలో శుక్రవారం శంకర్ నేత్రాలయ - ఐఐటి మద్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా తుడా ఛైర్మెన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హాజరై ప్రసంగించారు. డాక్టర్ మల్లం మోహన్ పద్మ సేవలను కొనియాడారు. తల్లి దండ్రుల పట్ల ప్రేమ, సొంత గ్రామానికి సేవ చేయాలన్న తపనతో ఉచిత కంటి వైద్య శిబిరానికి శ్రీకారం చుట్టడం అభినందనీయం అని ప్రశంసించారు. వీరి స్ఫూర్తితో మరెందరో సొంత గ్రామాలకు ఏదో రకంగా సహకారం అందించాలని పిలుపునిచ్చారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను, సొంత గ్రామాన్ని ఎప్పటికీ మరిచిపోరాదని హితవు పలికారు. ఉచిత కంటి శుక్లాల ఆపరేషన్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత కంటి పరీక్షలను చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, డాక్టర్ మల్లం మోహన్ , పద్మ తో కలిసి పరిశీలించారు. వైద్య శిబిరానికి విచ్చేసిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి 29వ తేది నుండి ఆపరేషన్లు చేయటం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సుమారు 150 మంది శుక్రవారం హాజరై కంటి పరీక్షలు చేసుకోవడం జరిగింది. చుట్టుపక్కల గ్రామాల అవసరమైన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మల్లం చంద్రమౌళి రెడ్డి తెలిపారు. చికిత్సకు విచ్చేసిన వారందరికీ భోజన వసతి కల్పించారు. మోహిత్ రెడ్డి వెంట తొండవాడ సర్పంచ్ మల్లం దీపికా రెడ్డి, నర్సింగాపురం సింగిల్ విండో ఛైర్మెన్ మల్లం చంద్రమౌళి రెడ్డి, మూర్తి, శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు.

కార్మిక చైతన్య

బస్సు యాత్రకు తరలి రండి: టిఎన్‌టియుసీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్ర శనివారం సాయంత్రం నాలుగు గంటలకు నగరి ఎన్టీఆర్ సర్కిల్‌లో నిర్వహించేందుకు సన్నాహక ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తరలి రావాలని టిఎన్‌టియుసి చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షులు రావిళ్ల మాధవ నాయుడు పేర్కొన్నారు. కార్మిక సంఘాల నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి.ముఖ్యఅతిథిగా నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్, టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు గొట్టుముక్కల రఘురామ రాజు పాల్గొంటారని సభలో రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ, మండల, టిఎన్టియుసి, టిడిపి అనుబంధ, సంఘ నాయకుల, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, అధికార ప్రతినిధి నాయుడు జ్యోతి నాయుడు, నియోజకవర్గం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాణిక్యవాసన్,ఆనంద రెడ్డి, అధికార ప్రతినిధి మోహన్ బాబు, గంగాధర నెల్లూరు టిఎన్‌టియుసి అధ్యక్షులు గాలి బాబు నాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి-సోమల:

రహస్యంగా పేకాట ఆడుతున్న ముగ్గురుని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెంకటనరసింహులు తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు వెల్లడిస్తూ.. మండలంలోని నడింపల్లి పంచాయతీ సూరయ్యగారిపల్లి సమీపంలో పేకాట ఆడుతున్న అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ముగ్గురుని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.15,325 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

శ్మశాన వాటిక పనుల తనిఖీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

పట్టణంలోని స్థానిక శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేసిన మిషన్ల పనులు, రోడ్డు నిర్మాణ పనులను పురపాలక సంఘ కమిషనర్ కేఎల్ఎంఎన్ రెడ్డి శుక్రవారం పరీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పుత్తూరు మంత్రి రోజా ఆదేశాల మేరకు పట్టణం లోని శ్మశాన వాటిక అభివృద్ధి పనులను పరిశీలించారు. శ్మశాన వాటికకు పక్కన వున్న వాగుకు ఇరువైపులా ముళ్ల పొదలను తొలగించి మొక్కలు నాటేందుకు అనువైన వాతావరణం కల్పించాలని డిఇకి సూచించారు. శ్మశాన వాటిక రోడ్డుకు ఇరువైపులా మట్టిని చదును చేసి రెడ్ సాయిల్‌తో కవర్ చేయాలని ఆదేశించారు. త్రీ ఫేజ్ కరెంట్‌ను యుద్ధ ప్రాతిపదికన కరెంట్ తీగలు అమర్చాలని ఏఇను ఆదేశించారు.

టిడిపి రాష్ట్ర బీసీసెల్ ఆర్గనైజింగ్

సెక్రటరీగా రామ్మూర్తి యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

టిడిపి రాష్ట్ర బీసీ సెల్ కమిటీలో చంద్రగిరి నియోజకవర్గం సీనియర్ నాయకులు(శ్రీనివాస యాదవ్)రామ్మూర్తి యాదవ్ ను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని కలిసి రామ్మూర్తి యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మరింత ఉత్సాహంతో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేస్తానని రామ్మూర్తి యాదవ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఫార్మసీ అసోసియేషన్ అధ్యక్షులుగా నరేష్


అధ్యక్షులుగా ఎన్నికైన నరేష్‌బాబు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో జిల్లాల విభజన జరిగిన తర్వాత తొలిసారిగా చిత్తూరు జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్టులు అసోసియేషన్ అధ్యక్షుడిగా నరేష్‌బాబు, కార్యదర్శిగా బాబునాయుడు, కోశాధికారిగా రాజప్ప శెట్టి ఎన్నికయ్యారు. శుక్రవారం చిత్తూరులో ఆంధ్రప్రదేశ్ కెమిస్ట్, డ్రగ్గిస్ట్ సంఘం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు పివి రత్నం, రాష్ట్ర నాయకులు రంగారెడ్డి, రంగారావు, శివకుమార్ పాల్గొన్న ఈ సమావేశంలో జిల్లా కొత్త సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డ్రగ్స్ బానిసలు వేధింపులు అరికట్టండి: కెమిస్ట్ అసోసియేషన్ డిమాండ్ రాత్రి వేళల్లో మందుల దుకాణాల వద్ద డ్రగ్స్ బానిసల దాడులు అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ కెమిస్టు, డ్రగ్గిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పివి రత్నం డిమాండ్ చేశారు. శుక్రవారం చిత్తూరులో నిర్వహించిన డ్రగ్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాత్రి వేళల్లో మందులు దుకాణాల వద్ద డ్రగ్స్ బానిసలు వేధింపులు ఎక్కువ అవుతున్నాయని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే మందులను అరికట్టి రాష్ట్రంలోని వ్యాపారస్తులను ప్రోత్సహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. చిత్తూరు జిల్లా అసోసియేషన్ కొత్త అధ్యక్షుడు నరేష్‌బాబు మాట్లాడుతూ మందుల దుకాణాల యజమానుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లాస్థాయికి వాలీబాల్ జట్టు


క్రీడాకారులను అభినందిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-పెద్దపంజాణి:

'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీల్లో భాగంగా కొళ్లత్తూరు పంచాయతీకి చెందిన జట్టు నియోజకవర్గ స్థాయిలో గెలుపొందింది. దీంతో జిల్లా స్థాయికి ఆ జట్టు ఎంపికైంది. క్రీడాకారులను స్థానిక సర్పంచ్ రవికుమార్ ఆధ్వర్యంలో క్రీడాకారులను అభినందించారు. శుక్రవారం నేలపల్లి పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన జట్టును ప్రశంసిస్తూ గ్రామీణ స్థాయిలో పోటీలు నిర్వహించడం వల్ల వారి ప్రతిభ తెలిసిందని, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వారికి నచ్చిన క్రీడారంగంలో నైపుణ్యం సాధించి ఉత్తమ ప్రతిభ కనబరచాలని క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వం పెరిగి వారు ఎంచుకున్న రంగంలో విజయం సాధిస్తారని సర్పంచ్ రవికుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మరింత ఉత్తేజాన్ని స్తుందని మాజీ ఎంపిటిసి ప్రసాద్ రెడ్డి అన్నారు.

రోడ్డు సమస్యకు పరిష్కారం


పనులు ప్రారంభిస్తున్న మంత్రి

- రూ.1.08కోట్ల నిధులతో ఇరుగువాయి రోడ్డు
- గ్రామీణ రోడ్డుకు మోక్షం
- పనులు ప్రారంభించిన మంత్రి ఆర్‌కే రోజా

ప్రజాశక్తి-నగరి: నాలుగు దశాబ్దాల రోడ్డు సమస్యకు పరిష్కారం చూపినట్లు మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. నగరి నాగలాపురం రోడ్డు నుంచి ఇరుగువాయి గ్రామానికి రూ.1.08 కోట్ల నిధులతో నిర్మించే ఆర్‌అండ్‌బీ (బీటీ) రోడ్డు పనులను శుక్రవారం ఆమె ప్రారంభించి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అవసరమ్యే పనులను చేసిపెట్టడంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. గత పాలకుల్నా అరచేతిలో వైకుంఠం చూపుతూ ప్రజలను మభ్యపెట్టడం తమకు చేతకాదన్నారు. తాము చేపట్టే అభివృద్ధి చేతల్లోనే కనిపిస్తుంది తప్ప మాటల్లో కాదన్నారు. ప్రస్తుతం నగరి నాగలాపురం రోడ్డు నుంచి ఇరుగువాయి వరకు రెండు కిలోమీటర్ల దూరం వరకు నిర్మించే ఈ రోడ్డు గోవిందప్పనాయుడు కండ్రిగ, గోవిందప్పనాయుడు కండ్రిగ ఎస్టీ కాలనీ, ఇరుగువాయి, ఇరుగువాయి ఎస్సీ కాలనీ, ఆరూరు, ఆరూరు సెంటరు సుమారు 600లకు పైగా కుటుంబాలకు ఉపయోగపడుతుందన్నారు. ఎన్నో యేళ్ల ఎదురుచూపైన రోడ్డుసమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి, నాయకులు వేణురాజు, దామునాయుడు, మురళి, మధు, గోవింద, శేఖర్, రఘు, లక్ష్మీపతి, ఇరుగువాయి పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి: డాక్టర్ థామస్


ఇంటింటి పర్యటనలో డాక్టర్ థామస్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: చంద్రబాబు సీఎం అయితేనే ఆంధ్ర రాష్ట్రానికి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ డాక్టర్ థామస్ అన్నారు. మండలంలోని అగరంగళం పంచాయతీలో శుక్రవారం 'మన ఇంటికి మన డాక్టర్ థామస్, బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మ్యానిఫెస్టోను అందజేసి టీడీపీని గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ద్వారకానగరంలో వైసీపీకి చెందిన మహేంద్రయాదవ్‌తో పాటు పలువురు స్థానికులు డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు మోహన్ రెడ్డి, పురుషోత్తమ నాయుడు, మునిరత్నం నాయుడు, ప్రభాకర్ రెడ్డి, వెంకట్రాయలు, వెంకటేష్, శివా, క్రిష్టమనాయుడు, చిట్టిబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిపోయేందుకు జగన్ సిద్ధం: గాలి భాను


సమావేశంలో మాట్లాడుతున్న గాలిభాను

ప్రజాశక్తి-నగరి: ప్రజా తిరుగుబాటు తప్పదని తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పారిపోయేందుకు సిద్ధంగా ఉన్నాడని, అందుకు హ్యాపీగా దిగిపోతా అంటూ కొత్త డ్రామాకు తెరలేపారని నగరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ అన్నారు. నగరి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దుర్మార్గపు, దౌర్జన్య పాలనతో విసిగిపోయిన ప్రజలు తిరుగుబాటు చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఐదేళ్ల పాలనలో ప్రజల్ని, వనరులను దోచుకుని సుమారు రు.4 లక్షలు కోట్లు దోచుకున్నాడని ఆరోపించారు. దాదాపు రూ.10 లక్షలు కోట్లు అప్పులు చేశాడని, జీతాలిచ్చే పరిస్థితి కూడా లేని స్థితికి రాష్ట్రాన్ని దిగజార్చాడని, పెట్టుబడులు, పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరిమేసాడని విమర్శించారు. ఒక్క ఛాన్స్ అని అధికారం ఇచ్చిందానికి నష్టపోయింది చాలని ప్రజలు గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.